1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | జూన్ 20, 2024 | www.navatelangana.com

తొమ్మిదేండ్ల బాలుడు అదృశ్యం

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని పాత ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ సాయికుమార్(9) మూడు రోజుల నుండి కనిపించడం లేదని తండ్రి రాథోడ్ గోపాల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 16 తండ్రి మేస్త్రీ పని చేయడానికి ఖానాపూర్ వెళ్లాడు. భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి ఇంటి వద్ద కుమారుడు సాయికుమార్ లేకపోవడంతో చుట్టుపక్కల ఇండ్లలో, వాడలో వెతికారు. ఆచూకీ లభించలేదు. కొన్ని రోజుల క్రితం ఇంటి పక్కన ఉన్న టేకుల చంటి కుటుంబంతో గొడవలు జరిగాయి. వారే కుమారుడు టేకుల సీతారాంను కిడ్నాప్ చేసి ఉంటారని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై 34 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. బుధవారం కలెక్టర్ రాజార్షి షాను ఆయన కార్యాలయంలో కలిసి అవిశ్వాస తీర్మాన నోటీస్ అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్ అజయ్ మాట్లాడుతూ వైస్ చైర్మన్‌గా జహీర్ రంజానీని వ్యతిరేకిస్తూ 34 మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారని పేర్కొన్నారు. అవిశ్వాసానికి 25 మంది మాత్రమే అవసరం కాగా 34 మంది సంతకాలు పెట్టారని తెలిపారు.



అత్తింటి వేధింపులతోనే కవిత ఆత్మహత్య

- దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లికి చెందిన గూడ కవిత ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం అక్కెపల్లిలో గల కవిత పుట్టింటి వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకురాళ్లు మాట్లాడుతూ కవిత ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కవితను ఎర్రగుంటపల్లికి చెందిన గూడ రవికి ఇచ్చి వివాహం జరిపించారని, వివాహ సమయంలో రూ.5లక్షల నగదు, 8 తులాల బంగారం కట్నం కింద ఇచ్చారని తెలిపారు. నగదుగా ఇస్తామన్న రూ.5 లక్షల నుండి రూ.4 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా రూ.లక్ష ఆపినందుకు భర్త రవితో పాటు అత్త కట్నం డబ్బుల కోసం కవితను రోజు వేధింపులకు గురి చేయడంతో పాటు చిత్రహింసలు పెట్టే వారన్నారు. దీనికి తోడు కవితకు పిల్లలకు కాకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లకుండా అక్రమ సంబంధాలు అంటగడుతూ వేధించే వారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న కవితతో గొడవకు దిగడంతో పుట్టింటికి వెళ్తానని బయలుదేరిన కవితను ఇంట్లోకి ఈడ్చుకెళ్లి గొంతు పిసికి, బెల్టుతో కొట్టి చంపేస్తానని హెచ్చరించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగినట్లు తెలిపారు. అయినా అత్తింటి వారు కవితను పట్టించుకోకపోవడంతో ఇరుగు పొరుగు వారు మందలించడంతో తప్పనిసరై కవితను ఆసుపత్రికి తీసుకెళ్లారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కవిత తుది శ్వాస విడించిందని, కవిత ఆత్మహత్యకు కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కవిత కుటుంబాన్ని కలిసిన వారిలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు బోగె నాగజ్యోతి, జిల్లా కార్యదర్శులు శ్యామల, ఉమారాణి, జిల్లా, పట్టణ నాయకురాళ్లు బొండ సరిత, తుమ్మ రేణుక, బండారి రాజేశ్వరి, తుమ్మ రేణుక, రాతిపెల్లి సంధ్య, బోయిరె రమాదేవి ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని 36వ వార్డ్ కౌన్సిలర్ గంద్రత్ రాజేందర్, 2వ వార్డు కౌన్సిలర్ సంద నర్సింగ్ కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం హస్తం తీర్థం పుచ్చుకున్నారు. గంద్రత్ రాజేందర్ ఐదు సార్లు కౌన్సిలర్‌గా గెలవగా సంద నర్సింగ్ మూడుసార్లు విజయకేతనం ఎగుర వేశారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, 49 వార్డుల్లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, నాయకులు భోజారెడ్డి, బూర్ల శంకరయ్య, రాజా లింగన్న, ఖయ్యుం, భరత్ శ్రవణ్ నాయక్, ఎల్మ రామ్‌రెడ్డి, మానే శంకర్, బూరే సురేష్, అఫ్రోజ్ అహ్మద్, మేకల మధుకర్, బండి నరసింహ చారి, ముక్కెర సంతోష్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం నుండి ప్రారంభించామని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీల అమలులో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులలో మహాలక్ష్మి పథకం(రూ.500కు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం (కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్లు ఉచిత విద్యుత్)కు సంధించించి ఇప్పటి వరకు లబ్ధిపొందని వారు ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తుదారులు ప్రజా పాలన సేవా కేంద్రానికి వచ్చేటప్పుడు ప్రజాపాలన రశీదు, ఆధార్, రేషన్ కార్డు, కరెంట్ బిల్, గ్యాస్ బిల్ పత్రాలను వెంట తీసుకొని రావాలని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈనెల 20న ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2047 నాటికి సికిల్ సెల్‌ను నిర్మూలించడమే లక్ష్యం

- రిమ్స్‌లో సికిల్ సెల్ అవగాహన దినోత్సవం
- పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్ర ఏడీ అమర్‌సింగ్ నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సికిల్ సెల్ వ్యాధి నివారణ అవగాహనతోనే సాధ్యమవుతుందని, వ్యాధి పట్ల భయాందోళనకు గురికావల్సిన అవసరం లేదని కలెక్టర్ రాజర్షిషా, సికిల్ సెల్ విభాగం రాష్ట్ర ఏడీ అమర్ సింగ్ నాయక్ తెలిపారు. 2047 నాటికి పూర్తిగా వ్యాధిని తొలగించాలనే లక్ష్యం కాగా ఆ లక్ష్యానికనుగునంగా పని చేయాలని అన్నారు. బుధవారం సికిల్ సెల్ నివారణ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. దీనికి వారు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా సైతం సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సికిల్ సెల్ అనీమియాను నిర్మూలించడానికి ఎంతగానో కృషి చేస్తున్నాయని అన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలతో పాటు మన ఆదిలాబాద్ జిల్లా కూడా ఉండడంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు సాధారణంగా 6నెలల వయస్సులో ప్రారంభమవుతాయని, అవి ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి భిన్నంగా ఉంటాయని కాలక్రమేణా మారవచ్చని అన్నారు. ఈ వ్యాధికి మందులు, శస్త్ర చికిత్స, రక్త మార్పిడి, మూల కణాల మార్పిడి, జీవనశైలి మార్పులు స్వీయ సంరక్షణ ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వ్యాపిస్తుందని, 0 నుండి 40 ఏళ్ల వయసు కలిగిన వారికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వచ్చిన వారందరూ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సికిల్‌సెల్ వ్యాధి అనేది ఒక జన్యు రక్త వ్యాధి అని, రోగి మొత్తం జీవితాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. ఈ వ్యాధి ప్రస్తుతం గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపిస్తుందని, వారి సంరక్షణకు మెరుగైన భవిషత్తు కోసం స్క్రీనింగ్ టెస్ట్, అవగాహన కార్యక్రమాలు చేపట్టి వ్యాధి వ్యాప్తిని తగ్గించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దిలీప్ కుమార్, వైసీ శ్రీనివాస్, డిఐఒ శ్రీనివాస్, గజానన్, డిఎల్ఓ శ్రీధర్ పాల్గొన్నారు.



రక్త పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్



పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

అభివృద్ధిని విస్మరించారని విమ్మర్శిస్తే కేసులు పెట్టిస్తారా..?

- బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్ ఆగ్రహం



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి విస్మరించారని విమర్శించిన బీఆర్ఎస్ నాయకుడు కలెగూర రాజకుమార్‌పై కాంగ్రెస్ నాయకులు అక్రమంగా కేసు పెట్టించారని బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ ఆరోపించారు. బుధవారం భీమారం మండల కేంద్రంలో కలెగూర రాజకుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జోడు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసిన కలెగూర రాజకుమార్‌పై కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర పోలీసులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గడ్డం వెంకటస్వామి మొదలుకొని దళిత నాయకులను అణచివేస్తూ దళితుల పొట్ట కొడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చెప్పిందే వేదం అన్నట్లుగా విచారణ చేయకుండా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం చెన్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఇండ్లలో అక్రమంగా చొరబడి దాడులు చేయడంతో పాటు అక్రమంగా కేసులు నమోదు చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మందమర్రి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో సోషల్ మీడియా వారియర్స్ గొంతు నొక్కాలనే ఉద్దేశంతో వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తూ పోలీస్ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో జైపూర్ జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, మందమర్రి జెడ్పీటీసీ రవి, ఎంపీపీ మంత్రి బాపు, పానగంటి లక్ష్మణ్, మాజీ ఎంపీపీ జాడి ఏసయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ ఆతుకూరి రాము పాల్గొన్నారు.

తిర్యాణి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్, పక్కన జిల్లా అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తిర్యాణి మండలాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం తిర్యాణి మండల పరిషత్ కార్యాలయంలో నీతి ఆయోగ్‌లో ఉన్న 39 అంశాలపై జిల్లా, మండల అధికారులతో సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీతి ఆయోగ్ కార్యక్రమంలో రాష్ట్రంలో 8మండలాలను ఎంపిక చేయగా అందులో తిర్యాణి మండలం ఒకటని తెలిపారు. తిర్యాణి మండలాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని అధికారులను ఆదేశించారు. నీతి ఆయోగ్‌లోని విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ఆర్థిక చేకూర్పు మొదలైన ఐదు విభాగాలు 39అంశాలపై పని జరుతోందని తెలిపారు. ఈ ఐదు విభాగాలు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, సీడీపీవో సాదియా రుక్సానా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

నిర్ణీత ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

విత్తనాలు, ఎరువులను ఎక్కువ ధరకు విక్రయిస్తే డీలర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం తిర్యాణి మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తన, ఎరువుల గోదాంను, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ నిర్ణయించిన ధరలకే విత్తనాలను, ఎరువులను విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేష్ ఉన్నారు.

సికిల్‌సెల్ వ్యాధిని అరికట్టేందుకు కృషి చేద్దాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

సికిల్‌సెల్ వ్యాధి రాకుండా ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లోని పీఎంఆర్సి భవనంలో నేషనల్ సికిల్ సెల్ ఎనీమియా ఎలిమేషన్ మిషన్ - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణంగా మనిషి రక్తకణాలు గుండ్రంగా ఉంటాయని, కానీ సికిల్ ఎనీమియా వ్యాధి బారినపడ్డ వ్యక్తులలో రక్తకణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని అన్నారు. ఈ వ్యాధి ఉన్న స్త్రీ, పురుషులు పెళ్లి చేసుకోవద్దని, చేసుకుంటే వారికి పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి వస్తుందని అన్నారు. ప్రతి నెల రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. జన్యుపరమైన మార్పులతో వచ్చే ఈ రక్తహీనతకు మందులు లేవని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యాధిపై ప్రజలకు వైద్యాధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల డాక్టర్లు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎల్లవేళల సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ రాథోడ్ జనార్ధన్, అడిషనల్ డిఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్, వైద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రశంసా పత్రం పొందిన కలెక్టర్ రాజర్షిషాను టీఎన్జీవోస్ జిల్లా కమిటీ సభ్యులు సన్మానించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల విధులను సజావుగా నిర్వహించడంతో పాటు విజయవంతం చేసిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంద అశోక్, ఎ.నవీన్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉద్యోగులను సమన్వయపరచడంలో కలెక్టర్ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ జరపాలని, వివిధ శాఖలలో ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సమస్యలు విని పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సభ్యులు తిరుమల్‌రెడ్డి, కొమ్రే అరుణ్ కుమార్, ప్రశాంత్ ఠాకూర్, చంద్రశేఖర్, సుజాత, సుమిత్ర, రాజు, సాయి, నవీన్, ఆశాజ్యోతి, సంజయ్, రజినీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ ఒప్పంద అధ్యాపకుడు కిషన్‌కు రాజస్థాన్ రాష్ట్ర సన్రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆధునిక సమాజంలో ప్రజాస్వామ్యంపై దాని పరిణామం యొక్క భావనను అన్వేషించడం అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యం.స్వామి, వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కిషన్‌ను అభినందించారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శిని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల కొరత ఉన్నట్టు విన్నవించారు. త్వరలోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. పాఠశాలల అదనపు తరగతి గదులను నియమించాలని కోరారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన కిషన్ ఉపాధ్యాయుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు పోశెట్టి, నారాయణ, దేవరావు పటేల్, మణిరామ్, గ్రామస్తులు కుటుంబ సభ్యులు ఉన్నారు.



ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


ఆదిలాబాద్‌రూరల్

నవతెలంగాణ-ఉట్నూర్

ఏఐసీసీ మాజీ జాతీయ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముందుగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే యోధుడు, ప్రశ్నించే గొంతుక రాహుల్ గాంధీ అని అన్నారు. ప్రజల గుండెల్లో చేరగని ముద్ర వేశారని, ప్రజాస్వామ్యం కాపాడడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీ 400 పార్ అంటూ నినాదాలు చేస్తే ప్రజలు ఇచ్చిన తీర్పు ముందు తలొగ్గరని అన్నారు. మరో కొన్ని రోజుల్లో ఎన్డిఎ ప్రభుత్వం కూలీ పోతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని తెలిపారు. దేశంలో నైతికంగా కాంగ్రెస్ పార్టీయే విజయం సాదించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి ఖానాపూర్ నియోజకవర్గ ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన వారికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ పట్టణం కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి, పండ్లపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత్ జోడో యాత్రతో దేశాన్ని ఏకంచేసి, నియంత మోడీ పాలనపై యుద్ధం చేస్తున్న రాహుల్ గాంధీ ప్రతి ఒక్క కాంగ్రెస్ వాదికి ఆదర్శమని అన్నారు. ఆయన నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ప్రజాజీవితంలో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, మావల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, దామోదర్ రెడ్డి, నలిమేల నవీన్‌రెడ్డి, కొరటి ప్రభాకర్, కుర్ర నరేష్, గాలిపెల్లి నాగన్న, వెంకటేష్, అడెల్లు, లస్మన్న, సంటెన్న పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు సొనాల గ్రామంలో రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు పూలే సంఘం అధ్యక్షుడు గాజుల పోతన్న ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బోథ్ బస్టాండ్ ఆవరణలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొనాల టౌన్ ప్రెసిడెంట్ చెట్లపల్లి అనిల్, సీనియర్ నాయకులు అమృత్‌రావు పాటిల్, చంటి, నారాయణ, అబుద్, శాకిర్, భోజాన్న, లింబాజీ గొల్ల రాజు పాల్గొన్నారు.

నార్నూర్ : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యతులో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవ్ రావ్, ఉత్తం రాథోడ్, దాదే అలీ, అహ్మద్, కే.మహేందర్, రమేష్, దేవీదాస్, షేక్ నసీర్, నవీన్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, రాహుల్ గాంధీ జన్మదినం పురస్కరించుకుని జిల్లా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి జిల్లా నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర వ్యాప్త యువజన కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, బోథ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి రక్తదానం చేశారు.


బోథ్


నార్నూర్


ఆదిలాబాద్‌టౌన్ : హైదరాబాద్ గాంధీభవన్‌లో రక్తదానం చేస్తున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు

భోజన బిల్లులు అందజేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయిన మహిళలకు భోజనం పెడుతున్నామని వాటికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ప్రభుత్వం చెల్లించాలని జిల్లాపెల్లి కృష్ణావేణి అధికారులను కోరారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని బాలింతలకు టెండర్ ద్వారా భోజనం అందిస్తున్నామని అన్నారు. తనకు గత 13 నెలల నుంచి బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు సంవత్సరాల కాలం పాటు రాకపోవడంతో బాలింతలకు భోజనం పెట్టాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. బాలింతలకు మెనూ ప్రకారం.. పాలు, బ్రెడ్, లేదా రవ్వ ఉప్మా, మధ్యాహ్నం అన్నం పప్పు, కూర, సాయంత్రం అన్నం పప్పు, కూర, లేదా గుడ్డు అందిస్తున్నట్టు తెలిపారు. గ్యాస్ పొయ్యి, అన్నం పప్పు, కూరగాయలు, కారం, నూనె అన్ని వంట సామాగ్రి తీసుకొని తమ ఇంట్లో వండి ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్నట్టు పేర్కొంటున్నారు. అప్పులు చేసి ఇలా వడ్డిస్తున్నా కూడా గత సంవత్సరం మే నెల నుంచి ఇప్పటి వరకు బిల్లులు రాలేదని ఎలా భోజనం వడ్డించాలని పేర్కొన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి వెంటనే భోజన బిల్లులు అందించాలని కోరారు.

నేలలో తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలి



నవతెలంగాణ-పెంబి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది రైతులు విత్తనాలు వేసుకునే తొందరలో ఉన్నారని, బరువైన నేలల్లో 60 మి.మీ, తేలికపాటి నేలలో 30 మి.మీ వర్షపాతం నమోదు అయ్యేదాకా వేచి చూసి నేలలో సరైన పదను ఉన్నప్పుడే విత్తనాలు వేసుకుంటే మొలక శాతం బాగుంటుందని వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం తాటిగూడ, పులగంపాండ్రి గ్రామాలలో విత్తన నాణ్యత, పంట తొలిదశ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి విత్తనాలు విత్తుకున్న 48 గంటలలోపు ఎకరానికి ఒక లీటరు పెండిమిథాలీన్ అనే మందును పంట భూమిపై సమానంగా పడేలా పిచికారి చేసినట్లయితే విత్తిన నెల రోజుల వరకు పంటలో కలుపు మొలకెత్తకుండ ఉంటుందని రైతులకు సూచించారు. పంటకు వాడే మొత్తం భాస్వరం ఎరువులను తప్పనిసరిగా దుక్కి లోనే వేసుకుంటే మొక్కలు అధికంగా గ్రహిస్తాయని తెలిపారు. బ్రాండెడ్ కంపెనీ విత్తనం కొన్నా సరే రైతులు విత్తుకునే ముందర మొలకశాతం పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. పత్తి గింజలలో కనీస మొలక శాతం 60 కాగా మొక్కజొన్న విత్తనాలకు 80 నుండి 90 శాతం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీ ఫౌండేషన్ పెంబి ప్రతినిధి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వ సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయిస్తుందని అన్నారు. అందులో భాగంగానే పీఎంశ్రీ పథం కింద రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డీ రాజేందర్‌రెడ్డి, చంద్ర ప్రకాష్‌గౌడ్, సాహెబ్‌రావు, సరికెల గంగన్న, జమాల్, వెలిశాలి తిరుమలచారి, బడి పోతన్న, సాధు రామ్‌రెడ్డి, మధు, ఈర్ల విజయ్, రాము, బాలకిష్టు రాజేందర్, అల్లాడి నర్సయ్య, దగ్గారి నరేష్, రాజేశ్వర్, రామ్ లింగారెడ్డి, తోట మల్లేష్, జాదవ్ సంతోష్, గోకుల్, నరేష్, ఆకుల దేవన్న, ప్రిన్సిపాల్ రమకల్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని బొమ్మరిల్లు కాలనీ కొండాపూర్ రోడ్ ప్రాంతంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాలను బుధవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని రకాల హంగులతో, క్రమశిక్షణతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలతో ఉందన్నారు. కార్యక్రమంలో దేవరకోట ఆలయ చైర్మెన్ అమెడ శ్రీధర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువును మరో మూడు నెలలు పొడిగించినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి తిరుమల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 30 వరకు గడువు ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ వరకు మూడు నెలల పాటు గడువు పొడగించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వర్కింగ్ జర్నలిస్ట్ మిత్రులకు అసౌకర్యం కలగకుండా ఈ మూడు నెలల గడువు పెంచినందున రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

శివాజీ మహారాజ్‌కు పుష్పాభిషేకం



నవతెలంగాణ-తాంసి

ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం, హిందూ సామ్రాజ్య పర్వదినన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి హిందు యువసేన ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్‌తో కలిసి విగ్రహానికి పూలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు రాజు, కార్తీక్, అశోక్, సాయి, అజయ్, బద్రి, షాదుల్లా పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్నటువంటి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిధుల విడుదల గురించి, చనాక కొరాట ప్రాజెక్ట్ భూసేకరణ నిధుల విడుదల గురించి విన్నవించారు. జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఎయిర్‌పోర్టును కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా (డీపీఆర్) ప్రతిపాదనలు పంపాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ నాయకులు అశోక్ ముస్తపూరే, సంగప్ప ఉన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

లోకేశ్వరం : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాధ్గాం గ్రామస్తులకు ప్రొసిడింగ్ కాపీని ఆదిలాబాద్ ఉమ్మడి జెడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ అందజేశారు. సాధ్గాంలోని పోచమ్మ ఆలయ ప్రహరి గోడ నిర్మాణానికి జెడ్పీ నుంచి మంజూరైన రూ.2లక్షల నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, ప్యాక్స్ డైరెక్టర్ బండి ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ నిర్మూలనపై అవగాహన



నార్నూర్

నవతెలంగాణ-నార్నూర్

ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పాఠశాలలో అనిమియా నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం, జామడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలో విద్యార్థులు ర్యాలీ తీశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి, విద్యార్థులకు పరీక్షించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు, ఏకలవ్య గురుకులం ప్రిన్సిపల్ ఉపేందర్, హెచ్‌ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్‌దాస్, హిమబిందు, ప్రియాంక, ఈశ్వర్, జవహర్, గోకుల్, విజయ లక్ష్మి జిల్లా సార్మేడి దుర్గు పటేల్, జామడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : ప్రపంచ సికిల్‌సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అందర్‌బంద్, కరంజి, గోన, అర్లి, గిరిగాం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే సికిల్‌సెల్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్ రాజ్, ఎంపీపీ కుడిమెత రత్నప్రభ సంతోష్, ప్రధానోపాధ్యాయులు, రాజేశ్వర్, ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, సిబ్బంది బి.గంగాధర్, చంద్రకళ, చంద్ర సంతోష్, ఆరోగ్య కార్యకర్తలు జానాబాయి, గోదావరి, భాగ్యవతి, విష్ణుకుమార్, లచ్చుబాయి, సుజాత, సరస్వతి, నఫీజ, విజయలక్ష్మి అశా కార్యకర్తలు ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని అంకోలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సికిల్‌సెల్ ఎలిమినేషన్ మిషన్‌ను ఎంపీపీ గండ్రత్ రమేష్ ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సికిల్‌సెల్ వ్యాధిని పూర్తిగా 2047 వరకు నిర్ములించడానికి కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యంగా ట్రైబల్ గ్రామాల్లో ఉన్న రక్త హీనతతో బాధపడుతున్న ప్రజలకు ఎనిమియా లక్షణాలు గుర్తించి, అవగాహన కల్పించి, వారికి రక్తం ఎక్కించడం సరైన మందులను ఇచ్చి వారిని ఆరోగ్యవంతులుగా చేయడం ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ముందుగా ఎంపీపీ గండ్రత్ రమేష్ సికిల్‌సెల్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంకొలి వైద్యులు డా.సర్ఫరాజ్, మాజీ ఎంపీటీసీ రమణ, మాజీ మార్కెట్ ఉపాధ్యక్షులు గంగయ్య, అంకొలి ప్రధానోపాధ్యాలు కంటే నర్సయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, వసంత, మర్సకోల లక్ష్మీబాయి, కొడప యశోద, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వర్ దేవి, వేణుతాయి, ల్యాబ్ టెక్నిషియన్ మడావి శ్రీనివాస్, ఆశాకార్యకర్తలు పద్మ, కవిత, కౌసల్య, గోదావరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాంసి

నీట్‌పై స్పందించాలని ప్లకార్డులతో నిరసన



నవతెలంగాణ-నిర్మల్

నీట్‌పై స్పందించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ మాట్లాడారు. పరీక్షాపే చర్చ నిర్వహించే మోదీ నీట్ అవకతవకలపై సమాధానమివ్వాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంబీబీఎస్, ఇతర వైద్య, విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను ఉన్న దేశ ప్రధాని మోదీ స్పందించక పోవడం సిగ్గుచేటు అన్నారు. బీహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని, వార్తలు వస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. నీట్ పరీక్ష ఫలితాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులు 720 మార్కులు సాధించడం చూస్తే.. బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోందన్నారు. ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం అనేది అనేక సందేహాలకు తావిచ్చిందన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్, విద్యార్థులు భూమిక, కావ్య, స్పందన, అఖిల, అనూష పాల్గొన్నారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడి

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని ఖైరిగూడ, గోలేటి గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆసిఫాబాద్ ఎక్సైజ్ సీఐ డి.దిపక్ ఆధ్వర్యంలో దాడులు చేసి 800 వందల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి అక్రమ నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. 12 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు రమేశ్, సంధ్యా రాణి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్ల సురేష్, కమలకర్, మమత, రజిత, ధను, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కస్తూర్బాగాంధీ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ నాగసుధా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కస్తూర్బా బాలిక జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ 15, సీఈసీలో 20 సీట్లు ఖాళీలున్నాయని తెలిపారు. ప్రయివేటుకు దీటుగా విద్య బోధనతో పాటు వసతులు, భోజనం అందిస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రతి రోజు ప్రత్యేక తరగతులు, ఆంగ్లమాధ్యంలో విద్యాబోధన ఉంటుందన్నారు. వివిధ పోటీ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించేల ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహకరంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్య, వసతిని సౌకర్యాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మరిన్ని వివరాలకు 8297577855 సంప్రదించాలని తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

- రూ.2.47 లక్షలు దోచుకున్న దొంగలు
- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు




నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలో దీక్షిత ఫర్టిలైజర్‌లో రూ.238000, గొల్లపల్లి బలరాం ఆన్‌లైన్ సెంటర్‌లో రూ.తొమ్మిది వేలు దొంగలించారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి తలకు సంచిని ముసుగుగా వేసుకొని ఫర్టిలైజర్ దుకాణంలో వెనుక భాగం తలపు పగలగొట్టి దుకాణంలో చొరబడి కౌంటర్‌లో ఉన్న నగదు, ఆన్‌లైన్ సెంటర్‌లో తలుపు పగలగొట్టి కౌంటర్‌లో ఉన్న నగదను ఎత్తుకెళ్లాడు. బుధవారం షాపు యజమానులు షాపు తెరిచి చూసేసరికి కౌంటర్‌లో నగదు లేకపోవడంతో ఆందోళన చెందారు. ఈ విషయమై పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా ఎస్సై విక్రం చోరీకి పాల్పడ్డ దుకాణాలను పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టారు. దుకాణాల యజమానులు కవ్వాల సాయి, బలరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

అదుపుతప్పి లోయలో పడ్డ ట్రాక్టర్

- యువకుడి మృతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చేను దున్నుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి లోయలో పడి యువకుడి మరణించిన ఘటన లింగాపూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..లింగాపూర్ మండలంలోని ఎల్లాపటార్ గ్రామానికి చెందిన మహమ్మద్ అప్సర్, హాకాని అన్నదమ్ములు వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌తో చేనుకు వెళ్ళినారు. మహమ్మద్ అప్సర్ చేనును దున్నుతుండగా లోయ వైపు వెళ్లే క్రమంలో ట్రాక్టర్ వెనుక వైపు చూస్తూ అజాగ్రత్తగా నడపడం వలన ట్రాక్టర్ అదుపుతప్పి లోయలో ట్రాక్టర్‌తో పాటు పడిపోయాడు. అక్కడే ఉన్న మహమ్మద్ హాకాని గ్రామస్తులకు సమాచారం అందించాడు. లోయలోకి దిగి అప్సర్‌ను బయటకు తీశారు. అప్పటికే అప్సర్ ట్రాక్టర్‌లో ఇరుక్కుని చనిపోయాడు. మృతుని సోదరుడు హాకాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-రెబ్బెన

మహిళాలు ఆర్థికంగా ఎదగాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని వంకులం గ్రామంలో ఎన్‌ఎపీసీ ఆధ్వర్యంలో 26 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్ పంపిణీ చేయగా ఎమ్మెల్యే ముఖ్య అథితిగా హాజరయ్యారు. మహిళాలకు మిషన్లు అందిస్తు స్వయం ఉపాధిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ జిమ్మిడి సౌందర్య ఆనంద్, జడ్పీటీసీ వేముల సంతోష్, ప్యాక్స్ వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, వంకులం మాజీ సర్పంచ్ లలిత, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, మేరాట్ ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ నేతృత్వంలో పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. రానున్న రోజుల్లో దేశానికి ప్రధాని అయ్యే అన్ని లక్షణాలు రాహుల్ గాంధీకి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పూర్తయిన ఎన్నికల్లో మతాన్ని ఆధారంగా చేసుకుని పోటీలో ఉన్న బీజేపీ సీట్లు తగ్గాయని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగులను నలిపేద్దాం

- పిల్లలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందిద్దాం
- జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ఏర్పాట్లు చేసిన వైద్య ఆరోగ్య శాఖ
- నేడు నులిపురుగుల దినోత్సవం



నులిపురుగుల మాత్రలు వేస్తున్న ఎంపీపీ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కనీస కర్తవ్యం. భవిష్యత్‌లో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారైతేనే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుంది. అందుకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సి ఉంది. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటునందించాలి. అందుకోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలను తయారు చేస్తుంది. ఆరోగ్య సమాజ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 1-19 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 1,73,494 మందికి మాత్రలు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రలు అందించనున్నారు. అంతేకాక విద్యనభ్యసించని వారికి ఆశా కార్యకర్తలు మాత్రలు అందించే విధంగా చర్యలు చేపట్టారు. నేడు మాత్రలు వేసుకోని వారికి ఈ నెల 27న మరోసారి మాత్రలు వేసే విధంగా ప్రణాళికను రూపొందించారు.

అపరిశుభ్రతతోనే నులిపురుగుల వ్యాప్తి

అపరిశుభ్రతతోనే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోర్లు పెరిగినపుడు వెంటనే కత్తిరించుకోవాలి. అలా చేయకపోవడం వల్ల వాటిలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతుంది. అదేవిధంగా పరిశుభ్రమైన నీటిని తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం వల్ల కూడా నులిపురుగులు వ్యాప్తి చెందే అవకాశముంది. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూతలు కప్పి ఉంచాలి.

నులిపురుగుల వల్ల అనర్థాలు

నులిపురుగుల వల్ల పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా 1-19 సంవత్సరాల వయస్సున్న వారిలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపులో నొప్పి, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, వికారం, వాంతులు, మలంలో రక్తం, అతిసారంతో పాటు మరికొన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

నిర్మూలన కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు

పిల్లల్లో మూడు రకాల పురుగులుండే అవకాశం ఉంది. ఏలిక పాములు, నులిపురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. 1-2 సంవత్సరాల వయస్సు గలవారు 200 ఎంజీ మాత్ర, మిగతావారు 400 ఎంజీ మాత్రను వేసుకోవాలి. భోజనం తర్వాత వేసుకోవచ్చు. మాత్రలు వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉంటే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి. ఈ మాత్రలను దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, ఇతర వ్యాధులకు మందులు వాడుతున్న వారు వేసుకోకూడదు. నులిపురుగులున్న వారికి మాత్రలు వేసుకుంటే వికారం, వాంతులు కావడం జరుగుతుంది. అదే విధంగా స్వల్పంగా జ్వరం వచ్చే అవకాశముంది. దాని భయపడాల్సిన అవసరం లేదు.

డీవార్మింగ్‌డేను విజయవంతం చేయాలి

తుకారాం బట్, జిల్లా వైద్యాధికారి



నేడు జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా జిల్లాలో 1-19 ఏండ్ల పిల్లలందరికీ నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఈ మందుల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతాల్లో మందులు పంపిణీ చేయాలి. జిల్లాలో సంవత్సరం నుంచి 19 ఏండ్ల వయస్సు ఉన్నవారు 1,73,494 మంది ఉన్నట్టు గుర్తించాం. అందుబాటులో లేనివారికి ఈ నెల 27న 100 శాతం మాత్రలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

తుమ్మిడిహెట్టి ప్రాణహితపై ప్రాజెక్టును నిర్మించాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు



తుమ్మిడిహెట్టి ప్రాణహిత వద్ద శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

నవతెలంగాణ-కౌటాల

తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాణహితపై ప్రాజెక్టును నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. బుధవారం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రాంతాన్ని నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కౌటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు, తాగునీరు ఇవ్వాలన్నారు. 2008లో ప్రాజెక్టు శంకుస్థాపన చేసి రూ.11 వేల కోట్లు ఖర్చు చేసి కాలువలు తీసి ఉన్న ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఈ ప్రాజెక్టును ఎత్తివేసిందన్నారు. కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును ముందుకు తెచ్చి రూ.లక్ష 50 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టును మొదటి నుండి తాము వ్యతిరేకించామని తెలిపారు. తుమ్మిడి హెట్టి వద్ద నుంచి ఒక లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చే ఈ ప్రాజెక్టును పక్కనపెట్టి కింద కాళేశ్వరం నుంచి ఎల్లంపల్లికి మూడు ప్రాజెక్టుల నిర్మాణం చేసి మరో టీఎంసీకి కూడా ప్రారంభించిందన్నారు. కాళేశ్వరంను కమీషన్ల కోసం ఆశపడి నిర్మించిన మూడు సంవత్సరాలలోనే పూర్తి చేశారన్నారు. వారి ప్రభుత్వ కాలంలో తుమ్మిడి హెట్టి వద్ద ఫైనల్ చేయలేదని ఆరోపించారు. తుమ్మిడి హెట్టి వద్ద నుంచి ఎల్లంపల్లి వరకు 148 మీటర్ల మీద ప్రాజెక్టు కట్టుకుంటే సరిపోయేదని తెలిపారు. కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిర్మాణంలో డిజైన్లు క్వాలిటీలో మెయింటనెన్స్‌లో లోపాలున్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు శాశ్వత నీటి పరిష్కారంగా తక్షణం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్ పాషా, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు టి.శ్రీనివాస్, ఏఐఏఎంఎస్ జిల్లా నాయకులు రత్నం పోశం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిల్లల మానసిక, శారీరక అభివృద్ధిలో క్రీడలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వారిని క్రీడల్లో ప్రావీణ్యత సాధించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని కలిగించడంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఆటలు ఆడటం వల్ల విద్యార్థుల్లో స్నేహభావం, ఐక్యమత్యం పెంపొందుతాయని చెప్పారు. ఒక జట్టుగా ఉండటం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతి ఒక్కరిలో పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించగలుగుతామని తెలిపారు. క్రీడల ద్వారా క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు గాను గొప్ప లక్ష్యంతో నిర్వహించిన బడిబాట కార్యక్రమం మంచి ఫలితాలను సాధించిందన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసాధన పరిరక్షణ సమితి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని లంబాడి గూడా గ్రామంలో భూ సాధన పరి రక్షణ సమితి కమిటీ ఎన్నికలు జేఏసీ నాయకులు సోయం చిన్నయ్య ఆధ్వర్యంలో జరిగాయి. భూ సాధన పరిరక్షణ సమితి కమిటీ అధ్యక్షులుగా జాడి దిగంబర్, గౌరవ అధ్యక్షులు అల్లూరి మోహన్, ఉపాధ్యక్షులుగా సపవత్ బిక్షపతి, ప్రధాన కార్యదర్శిలుగా కొండ్ర బ్రహ్మయ్య, ఉమ్మరి లింగయ్య, సభ్యులుగా చౌదరి జలుపతి, పోరశెట్టి సుగుణకర్, పెగడపల్లి తిరుపతి, పెగడపల్లి సత్తయ్య, బెదికల జనార్దన్, బేడికల పాపయ్య సహాయ కార్యదర్శిగా తాళ్ల రామయ్య, సుందిళ్ల జోగయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఉమ్మెర బాలకృష్ణులు ఎన్నికైనట్టు ప్రకటించారు. భూ సమస్యలపై నిరాంతరం పోరాటలు నిర్వహించడంతో పాటు హక్కులను పరిరక్షించుకోవాలని నిర్ణయించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందనలు తెలిపారు.

పోడు రైతులను వేధించొద్దు

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే పాల్వాయి
- అటవీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో అటవీ అధికారులు పోడు రైతులను వేధింపులకు గురి చేస్తున్నారని, ఈ వేధింపులు ఆపేలా అటవీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తన నియోజకవర్గమైన సిర్పూరులో పోడు రైతులను అటవీ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అమాయక పోడు రైతులపై కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపిస్తున్నారని సీఎంకు వివరించారు. స్పందించిన సీఎం పోడు రైతుల విషయంలో పట్టుదలకు పోవద్దని అటవీ శాఖ ఉన్నతాధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే హరీష్‌బాబు విలేకరులకు వివరించారు.

గిరిజనుల ఆరోగ్య సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

- సికిల్ సెల్ జిల్లా ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన జనాభాలో ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సికిల్ సెల్ ఎనీమియా ఎలిమినేషన్ మిషన్ దినోత్సవం తీసుకువచ్చిందని ఆసిఫాబాద్ జిల్లా డిప్యూటీ వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన సికిల్ సెల్ జెనిటిక్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, జడ్పీటీసీ నాగేశ్వరరావు, జీసీడీఓ శకుంతల, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులను సికిల్ సెల్ ఎనీమియా నుండి కాపాడే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో 34 జిల్లాల్లో సికిల్ సెల్ ఎనీమియా బాధితులున్నట్లు గుర్తించారని, వారిలో ఎక్కువగా ఆదివాసీ, గిరిజనులు ఉన్నారన్నారు. జిల్లాలో వ్యాధి నివారణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగల నుండి విశేష స్పందన లభించింది. ఐసీఐసీఐ, ఎస్‌బీఐలలో రిలేషన్‌షిప్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు దాదాపు 170 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధికల్పనాధికారి రవికృష్ణ మాట్లాడుతూ జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రయివేట్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి లక్ష్మినరసింహం మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఖాళీగా ఉండకుండా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళా ద్వారా మొదటి విడత ద్వారా 35 మందిని ఎంపిక చేశారు. రెండో దశలో ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ప్రతినిధి సాయి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి డి జనార్దన్, వి దేవేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు వేగవంతం చేయాలి

- డీఐఈఓ నైతం శంకర్



నవతెలంగాణ-రెబ్బెన

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, గత సంవత్సరం రికార్డును అధిగమించాలని డీఐఈఓ నైతం శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అడ్మిషన్లను వేగవంతం చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుందన్నారు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడంతో పెరిగిన నాణ్యత ప్రమాణాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. అనంతరం సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
గురువారం | జూన్ 20, 2024 | www.navatelangana.com

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని భవిత సెంటర్‌లో బుధవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. 0-18 వయస్సు గల దివ్యంగా పిల్లలు భవిత కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వాసల ప్రభాకర్ సూచించారు. భవిత సెంటర్‌లో ప్రతి బుధవారం డాక్టర్ వెంకటేష్ ఫిజియోథెరీపీ క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్యాంపులో నాడీ వ్యవస్థ లోపము ఆర్థోపెడిక్ సమస్యలు గల పిల్లలను భవిత కేంద్రంకు తీసుకువచ్చి ఫిజియోథెరపీ సేవలు వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంక్లుసివ్ ఎడ్యుకేషన్ టీచర్స్ వెంకటేశ్వర్లు, సతీష్, సీఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు తాళ్లపల్లి రాజేశ్వర్ రాజీనామా

నవతెలంగాణ-జన్నారం



పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి రాజేశ్వర్ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

చివరి ఆయకట్టుకు నీరందేదెలా..?

- అధ్వానంగా కడెం ఎడమ ప్రధాన కాల్వ
- సాగునీటి పారుదలకు ఆటంకాలు
- పేరుకు పోయిన ముళ్ల కంపలు, పూడిక
- 12వేల ఎకరాల్లో పంట సాగు ప్రశ్నార్థకం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కడెం ప్రాజెక్టు ప్రధాన కాలువలు శిథిలా వస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు నీరందించే కాలువలలు దెబ్బతిన్నాయి. కాలువల్లో ముళ్ల కంపలు, పూడిక పేరుకుపోయింది. కాలువల మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. నిర్మల్ జిల్లాలోని కడెం కేంద్రంగా 1958 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు కుడి, ఎడను, డిస్ట్రిబ్యూటరీల కాలువల ద్వారా నిర్మాణాలను చేపట్టింది. ఈ కాల్వ పొడవున 42 డిస్ట్రిబ్యూటరీ కాల్వలను కూడా ఏర్పాటు చేశారు. కుడి ప్రధాన కాల్వ కడెం మండలంలోని 15 గ్రామాల 12వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఎడమ కాలువ ద్వారా నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తురాబాద్, మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల మండలాల్లోని ఆయకట్టుకు నీరందిస్తోంది. గత ఏడాది నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



ముళ్ల కంపలు, పూడికతో కూరుకుపోయిన కడెం ప్రధాన ఎడమ కాల్వ

శిథిలమైన ప్రధాన కాల్వ

ప్రధాన కాల్వ సిమెంట్ లైనింగ్ చెడిపోయి బిచ్చలు లేచి పగుళ్లు తేలి పెద్ద పెద్ద చెట్లు కాలువ లైనింగ్‌లోనే ఉండటంతో మరమ్మతులు లేక అధ్వన్నంగా తయారైంది. దీంతో సాగునీటికి ఆటంకం ఏర్పడనుంది. లైనింగ్ చేడిపోయి నీరు కూడా వృధా కానుంది. డిస్ట్రిబ్యూటరీ కాల్వల, ఉప కాల్వల పరిస్థితి కూడా మరి అధ్వాన్నంగా ఉంది. అధికార్లు, ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోక పోవడం వల్లనే ఎడమ ప్రధాన కాల్వ ఆగమ్యగోచరంగా తయారైందని విమర్శలున్నాయి. కాల్వకు ఇరువైపులా కొంత భాగం ఖబ్జాకు గురైందనే ఆరోపణలు లేకపోలేదు. కుడి ప్రధాన కాల్వ కడెం మండలంలోని 15 గ్రామాలకు 12వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఆయా మండలాలలో 65వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీరుపై ఆధారపడి రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. మండలంలోని దేవునిగూడ, కామన్ పల్లి సమీపాన ఉన్న 13వ డిస్ట్రిబ్యూటరీని రూ.ఐదుకోట్ల వ్యయంతో మరమ్మత్తులు చేపట్టారు. ఆ డిస్ట్రిబ్యూటరీ లైనింగ్ పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. మిగితా డిస్ట్రిబ్యూ టరీలు, ఉప కాల్వలు మరమ్మతుకు నోచుకోలేదు. ప్రదాన కాల్వ వాగులపై ఏర్పాటు చేసిన వంతేనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి వద్దకూడా సాగు నీరు వృధా అవుతుంది.

ప్రమాద కరంగా మారిన వంతెనలు

మండలంలోని ఇందన్‌పల్లి గ్రామ సమాపాన ప్రధాన ఎడమ కాల్వపై జనం రాకపోకలకు నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఆ వంతెన సైడ్ వాల్స్ కూలిపోయి కాల్వలో నీరు పారినప్పుడు పశువులు గొర్రెలు కాల్వలో పడే అవకాశాలున్నాయి. దీంతో ఆ గ్రామ ప్రజలు ఆ మార్గం గుండా వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మిగతా పలు చోట్ల ఏర్పాటు చేసిన వంతెనల్లో కొన్ని చోట్ల ఇరుకుగా ఉండి, మరికొన్ని వంతేనల బిచ్చలు లేచి కంకర అగుపిస్తూ ఎప్పుడు కూలిపోతాయో అని ఆ ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్య వైకరికి నిదర్శనం

ఐదేండ్లుగా మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని గూడేం వద్ద గోదావరి నదిపై లిఫ్టను అప్పటి డిస్ట్రిబ్యూటరీ నుంచి 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు ఆయకట్టు పోలాలకు నీరందిస్తున్నారు. అయినప్పటికి అధికార్ల నిర్లక్ష్యంతో, ప్రజా ప్రతినిధులు, పట్టించుకోకపోవడం వల్ల ప్రధాన ఎడమ కాల్వ, డిస్ట్రిబ్యూటరీ, ఉపకాల్వలు ఇప్పటికి మరమ్మత్తులకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ప్రధాన ఎడమ కాల్వ పలు చోట్ల సిమెంట్ లైనింగ్ పగుళ్ల తేలి, బిచ్చలు లేచి, ఇసుక మేటలు, కాల్వలోనే పెద్ద పెద్ద చెట్లు మొలిచి అధ్వానంగా మారాయి.









స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాలలోని బీసీ భవన్ లో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ద్వారా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. రిజర్వేషన్లన్ని తేల్చడం కోసం ముందుగా బీసీ జన గణన చేపట్టిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని, వెనక్కు నెట్టి వేయబడిన వారని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా సామాజిక వాటా దక్కితేనే ప్రజాస్వామ్యం నిలబడినట్టు అవుతుందని, మరోమారు మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేరని, తమ న్యాయమైన హక్కుల కోసం బీసీ బిడ్డలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సీనియర్ బీసీ నాయకులు చలమల్ల అంజయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నాయకులు మోతే రామదాసు, మోర చరణ్ కుమార్, రామస్వామి, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం లక్షెట్టిపేట సీడీపీఓ రేష్మకు వినతి పత్రం అందించారు. సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళిందర్ ఖాన్, అంగన్‌వాడీ టీచర్లు ఎల్ సరస్వతి జె కృప మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు టీఏడీఏలు ఇవ్వాలన్నారు, పెండింగ్‌లో ఉన్న అద్దె భవనాల కిరాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. టీచర్లకు రిటైర్మెంట్ సమయంలో రూ.లక్ష, ఆయాలకు రూ.50,000 ఇచ్చే జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సంస్థ కోసం కష్టపడి పనిచేస్తున్న తమకు, ఇంత తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వడం తగదన్నారు. ఈ జీఓ ఉపసంహరించుకోవాలని కోరారు. సమ్మె కాలంలో వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటవ తేదీన జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, బుచ్చమ్మ, పద్మ పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక గద్దెరాగడిలోని ఒక ఇంటిలో దొంగతనం చేసిన వ్యక్తిని బుధవారం పట్టణ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాన్నపు రాజు చంద్రకాంత్(43) గద్దెరాగడిలోని రోడ్ నెంబర్ 36 మల్లికార్జుననగర్ అమ్మ గార్డెన్ ఏరియాలో ఇంటికి తాళం వేసిన ఇండ్లలో చొరబడి లెనోవా లాప్టాప్ దొంగిలించాడు. బుధవారం మధ్యాహ్నం 1గంటలకు ప్రాంతంలో క్యాతనపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన స్కూటీ వాహన దారుని విచారించగా అందులో రెండు లాప్టాప్‌లు దొరికాయని తెలిపారు. నింధుతున్ని రిమాండ్కు తరలించినామని తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అజయ్, హెడ్ కానిస్టేబుల్ జంగు, కానిస్టేబుల్ సంపత్ లను సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

బెదిరింపులకు పాల్పడిన నిందితులకు జైలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమడుగు గ్రామానికి చెందిన భూక్య బాబురావు, భూక్య బీమా, భూక్య ప్రవీణ్‌లు కలిసి అదే గ్రామానికి చెందిన భూక్య లక్ష్మీపై 2021లో గొడవ చేసి లక్ష్మీపై దాడి చేసి చంపుతామని బెదిరించిన నింధితులకు కోర్టు జైలు శిక్ష విధించింది. బుక్యా లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె రవి ప్రసాద్ కేసు నమోదు చేసి చార్జ్ సిట్ వేశారు. ఈ కేసులో బుధవారం కోర్టు నిందితులకు ఒక్కొక్కరికి నెలరోజుల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించిందని పట్టణ ఎస్సై జి రాజశేఖర్ తెలిపారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ 54వ జన్మదినం సందర్భంగా మండల అధ్యక్షుడు ఎండీ ఈసా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ గట్టు మురళీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి ఎంపీటీసీ సిరంగి శంకర్ సహకార సంఘం వైస్ చైర్మన్ రత్నాకర్ రావు మాజీ గ్రంథాలయ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు మాసాడి ప్రభాకర్ పాల్గొన్నారు.

జన్నారం : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు వేరువేరుగా కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, కార్యదర్శి సయ్యద్ ఫసీఉల్లా, మత్స్య శంకరయ్య, కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు దూమల్ల రమేష్, ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఎండి రియాజోద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య, పాల్గొన్నారు.

మాతా శిశు కేంద్రాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారు

- సూపరింటెండెంట్ హరీష్‌చంద్రారెడ్డి

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లాలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మాత శిశు కేంద్రాన్ని పలువురు అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆస్పత్రిలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ నిజ నిజాలు గ్రహించకుండా ఆస్పత్రి ఎదుట ధర్నాలు, వైద్యులపై దాడులకు తెగ బడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజుల క్రితం మాత శిశు కేంద్రంలో డెలివరీ అయిన గర్భిణీకి వైద్యులు నడుము భాగంలో ఉండే నరాన్ని కట్ చేసినట్లు వస్తున్న వదంతులను ఖండించారు. గర్భిణీ ప్రసవించిన రోజు నుండి 5 రోజుల వరకు ఇక్కడే చికిత్స పొందుతూ ఆరోగ్యంగా ఉందని, చికిత్స తీసుకునే సమయంలో ఆమె కండిషన్‌లో మార్పులు రావడంతో పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా భాలింతను పరీక్షించిన గాంధీ ఆస్పత్రి వైద్యులు ప్రసవ సమయంలో ఎటువంటి ప్రమాదం జరగలేదని ధ్రువీకరించారని తెలిపారు. నిరసన, వైద్యులపై దాడికి ప్రయత్నించారని ఇలాంటి ఘటనలు గతంలో చాల జరిగినట్లు తెలిపారు. నిజ నిజాలు తెలుసుకోకుండా పలువురు ఆస్పత్రిపై చేస్తున్న దుష్ప్రచారం చేయడంతో చెడ్డ పేరు వస్తుందని ఒక వేళ వైద్యుల నిర్లక్ష్యంతోనే రోగి చనిపోయినట్లు రుజువైతే ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేయాలని అంతే తప్ప ఇలాంటి దాడులు, నిరసనలు చేయడం మానుకోవాలని సూచించారు. దీంతో హాస్పిటల్ లో వైద్యులు విధులు నిర్వర్తించడానికి వెనకాడుతున్నారని, అద్భుతమైన వైద్య సేవలు చేస్తున్న వారిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తెలిపారు. సమావేశంలో మంచిర్యాల పర్యవేక్షకులు భీష్మ, శ్రీమన్నారాయణ, వైద్యులు నాగ సింధుజ, అలివెని, ప్రశాంతి పాల్గొన్నారు.

గట్రావ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన గట్రావ్‌పల్లికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బస్సు రాకపోకలను స్థానిక నాయకులు ప్రారంభించారు. గతంలో మల్కెపల్లి, లక్ష్మీపూర్, వెంకటాపూర్, సోనాపూర్ నుంచి గట్రావ్ పల్లి వరకు బస్సు సౌకర్యం ఉండగా రాత్రి వేళలో ఈ ఏరియాలో దయ్యాలు తిరుగుతున్నాయనే నెపంతో ఈ గిరిజన ప్రాంతాలకు బస్సును నిలిపివేశారు. దింతో అనేక గ్రామాల గిరిజనులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు విన్నవించిన వెంటనే మంచిర్యాల బస్సు డిపో అధికారులతో మాట్లాడి మళ్లీ ఈ గిరిజన ప్రాంతాలకు బస్సు ప్రారంభించారని, ప్రేమ్‌సాగర్‌రావుకు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి గట్రావుపల్లి మాజీ సర్పంచ్ పేంద్రం రాజు, గ్రామ పటేళ్ళు సిడం గణపతి, పేంద్రం ప్రభాకర్, ఆత్రం అచ్చుత్‌రావు, సిడం బాదు, ఆత్రం రాజు, కుడమేత ఇస్రు, కాంగ్రెస్ నాయకులు మెరుగు శంకర్, కనక రాజు, మడావి అనంత్ రావు, ఎండీ రషీద్, ఖాదర్, షకీల్, వెడ్మ బాపురావ్, గుండ శ్రీనివాస్, సిలోజు మురళీ, సంగం రాజమౌళీ పాల్గొన్నారు.

వాల్వో ఆపరేటర్లకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-మందమర్రి

వాల్వో ఆపరేటర్లకు పనికి తగిన సమాన వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి అక్బర్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం కేకే ఓసీలోని ఆర్‌వీఆర్ కంపెనీ ఆపరేటర్ల జీతాల సమస్యలపై ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి అక్బర్ అలీ మాట్లాడుతూ వాల్వో ఆపరేటర్‌లకు పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, లేనిపక్షంలో సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సలేంద్ర సత్యనారాయణ. మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, మందమర్రి కాంట్రాక్ట్ వర్కర్స్ సెక్రటరీ జెట్టి మల్లయ్య, అసిస్టెంట్ సెక్రటరీ వెల్డి ప్రభాకర్, కెకె ఓసీ ఫిట్ సెక్రటరీ రాజేష్ యాదవ్, ఆర్కేపీ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ఇప్పకాయల లింగయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

నవతెలంగాణ-తాండూర్

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని నేరాలను నియంత్రించవచ్చునని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకుశం గ్రామంలో ప్రజలకు సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నట్లయితే అపరిచిత వ్యక్తుల కదలికలను కనిపెట్టవచ్చినని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చున్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాలు తోడ్పడుతాయని తెలిపారు. ప్రజలు భాగస్వామ్యంతో గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | జూన్ 20, 2024 | www.navatelangana.com

మరమ్మత్తులు చేపట్టిన డీబీఎల్ కంపెనీ

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలో డిబిఎల్ అధికారులు మురికి కాలువలు సరిగ్గా నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరిగాయి. దీన్ని గమనించిన అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టారు. వర్షాలకు మండల కేంద్రంలోని వ్యాపార సముదాయ దుకాణాల్లో నీళ్ల చేరడంతో స్పందించి మురికి కాలువల మరమ్మత్తు పనులను ప్రారంభించారు. మరమ్మతులు చేపట్టడంతో కొంతైనా ఊరటంగా ఉంటుందని వ్యాపారస్తులు, వాహనదారులు, ప్రజలు అంటున్నారు.

టూటౌన్ ఎస్ఐపై వేటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని టూటౌన్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న లాల్‌సింగ్ నాయక్‌పై వేటు పడింది. ఆయనను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మేకల మార్కెట్, తైబజార్ వేలం వాయిదా

నవతెలంగాణ-నస్పూర్

మేకల మార్కెట్, తైబజార్ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్, చైర్మన్ వేణు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేకల మార్కెట్, తైబజార్ రుసుము వసూలుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి బుధవారం మేకల మార్కెట్‌కు బహిరంగ వేలం నిర్వహించినప్పటికీ వేలంలో ఎవరూ పాల్గొనలేదని తెలిపారు. తైబజార్ వేలంలో ఇద్దరు పాల్గొన్నారని, మెజారిటీ లేనందున వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

చిరుత దాడిలో ఎద్దు మృతి



నవతెలంగాణ-తలమడుగు

చిరుత దాడిలో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని కుచులాపూర్‌లో జరిగింది. కుచులాపూర్‌కు చెందిన కళ్యాణం ఆశన్న అనే రైతు ఎద్దు మంగళవారం ఇంటి నుండి చేను పనులకు వెళ్లి విడిచి పెట్టాడు. ఎద్దు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి బుధవారం చుట్టుపక్కల ప్రాంతంలో వెతికారు. ఎద్దు మరణించి కనిపించింది. వెంటనే పశు వైద్యాధికారి దూదురాం రాథోడ్, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న అధికారులు చిరుతపులి ఆనవాళ్లను గుర్తించి చిరుత దాడి చేసినట్లు గుర్తించారు. ఎద్దు విలువ రూ.37వేలు ఉంటుందన్నారు. అదేవిధంగా కొత్తూరు గ్రామానికి చెందిన మేకల కాపారి మేకను కూడా కొత్తూరు శివారు చెరువు వద్ద చిరుత పులి దాడి చేసి చంపేసినట్లు కాపారి తెలిపారు. నాలుగు రోజుల నుండి చిరుతపులులు గ్రామ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో సంచారం చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని కొత్తూరు, తలమడుగు, కుచులాపూర్, పల్సీ (కే) గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఆర్‌ఎంపీలకు మద్దతుగా బోథ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

హైదరాబాద్‌లోని ఆర్‌ఎంపీ డాక్టర్లు సచివాలయం ఆవరణలో బుధవారం చేపడుతున్న నిరసన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీ డాక్టర్లపై చేపడుతున్న దాడులను ఖండిస్తూ వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు చేసే సేవలు అభినందనీయం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాల పాలనలో ఆర్‌ఎంపీ డాక్టర్లకు మద్దతుగా ఉండేదని అన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లపై చేస్తున్న దాడులను ఖండిస్తూ, వారికి న్యాయం చేసే విధంగా పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ డాక్టర్ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన గుంజాల చిన్నయ్య గత కొన్ని రోజులుగా మౌత్ క్యాన్సర్‌తో బాధపడుతూ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉండటంతో వారు కంది శ్రీనివాస్‌రెడ్డి హెల్ప్ డెస్క్ సభ్యులు సుధాకర్ టాక్రేని సంప్రదించారు. సుధాకర్ టాక్రే వెంటనే స్పందించి ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం సుధాకర్ టాక్రే ఆధ్వర్యంలో తంతోలి గ్రామానికి చెందిన తుకరెడ్డి నర్సింగ్ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. అనంతరం హెల్ప్ డెస్క్ సభ్యులు సుధాకర్ టాక్రే వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

విజయం కార్యకర్తలకు అంకితం

నవతెలంగాణ-కడెం

నా విజయం కార్యకర్తలకు అంకితమని వారు చేసిన కృషివల్లే తాను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిచానని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఎంపీ గోడం నగేష్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు కడెం ప్రాజెక్టు, మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించడానికి తాము ఎల్లప్పుడు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ కోసం కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-నిర్మల్

సొన్ మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో కేంద్ర ప్రభుత్వ పీఎం నిధులు రూ.13.50 లక్షలతో సైన్స్‌ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. రూరల్ మండలం డ్యాంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ పీఎం నిధులు రూ.13.50 లక్షలతో సైన్స్‌ల్యాబ్ నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యారంగానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ మేరకు వేలకోట్ల నిధులు మంజూరు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, సోన్ మండలం ఎంపీపీ బర్ల మానస హరీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, నాయకులు మార గంగారెడ్డి, జమాల్, పాఠశాలల, కళాశాలల అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-జన్నారం

కళాకారుల సమస్యలు పరిష్కరించాలని ఆదర్శ కళా సమితి అధ్యక్షుడు రాజలింగం కోరారు. బుధవారం కళాకారుల సమస్యలపై ఎంఎల్ఎ వెద్మ బొజ్జు పటేల్ కు ఆదర్శ కళా సమితి కళాకారులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమంలో కళాకారులు కీలక పాత్ర పోషించారనీ తెలిపారు. గత 22 సంవత్సరాలుగా కల నే నమ్ముకొని జీవిస్తున్నాము,,,తెలంగాణ మలిదశ ఉద్యమం లో ఉద్యమానికి మా ఆటా-పాటల ద్వారా ప్రజల్ని చైతన్య పరచినము,,,ప్రస్తుతం ఉండడానికి ఇండ్లు లేవు-చేయడానికి పని-పాట లేకుండా పూట గడవని పరిస్థితి నెలకొంది అన్నారు కళాకారులను ప్రభుత్వం గుర్తించి సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవధ్యక్షుడు ఆకుల నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా రమేష్, ఉపాధ్యక్షుడు అల్లాటి రాజన్న, ప్రధాన కార్యదర్శి కొండుకూరి రాజు, సంయుక్త కార్యదర్శి మామిడిపల్లి అశోక్ పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

నవతెలంగాణ-మందమర్రి

రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మనోవికాస్ పాఠశాల విద్యార్థులకు పండ్లు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మనోవికాస్ పాఠశాలలో కేకు కట్ చేసి, విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ కుమారుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంద తిరుమల్‌రెడ్డి, పైడిమల్ల నర్సింగ్ మాట్లాడుతూ త్యాగాల కుటుంబం గాంధీ కుటుంబమని దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం అలాగే దేశానికి రాహుల్ గాంధీ మరెన్నో సేవలు అందించాలని అగ్రనేతగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీ పాషా, ఎర్ర రాజు, ఎండీ ఇషాక్, సంగి సది, మనో వికాస్

గిరి ప్రాంతాల అభివృద్ధికి

సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను సూచించారు. ఈనెల 12న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జిల్లా పర్యటనలో భాగంగా వాంకిడి మండలం సవాతి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, భవనాలు, రోడ్లు, భూములు, ఇండ్ల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో గిరిజన గ్రామాల్లో అత్యవసరమైన చోట రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనులు సత్వరమే చేపట్టాలన్నారు. విద్య వైద్యానికి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, విద్యాశాఖ అధికారి అశోక్,



జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా పంచాయితీ అధికారి భిక్షపతి సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మిలో ప్రభుత్వ హామీ నెరవేర్చాలి



- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు బంగారం కూడా అందించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆసిఫాబాద్ మండల పరిధిలోని 66 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం పేదల పెండ్లిలకు పెద్దన్నగా నిలిచే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల్లో చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించిందని ఆ మాటను నిలబెట్టుకోవాలని కోరారు. జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మిలో ఎటువంటి మధ్యదళారుల ప్రమేయం ఉండదని ఎవరికి ఎటువంటి లంచం ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ పెంటు, తహసీల్దార్ శ్రీనివాస్, డిటి పొచయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని ఆదుకునే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్

నవతెలంగాణ-దహెగాం

లైంగిక దాడి, హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునే పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి ఇల్లు లేదని ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాన్నీ ఇస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిందే అన్నారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు మహిళ మంత్రి ఇన్‌చార్జిగా ఉన్నారని సాటి మహిళగా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌కు సైతం వినతిపత్రాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లేండుగురే శ్యామ్‌రావ్, షబ్బీర్,



ఆవుల రాజకుమార్, తెలిగే రమేష్, బిట్టు శ్రీనివాస్, శంకర్ గౌడ్, డబ్బుల జనార్దన్, ఎల్కరి ప్రశాంత్, షకీర్, గులాబ్, మహేందర్, సాయి, ఉదయ్, నాగుల లక్ష్మి, మోరె వెంకన్న, చప్పిడి నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆశాకిరణం రాహుల్ గాంధీ

- ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత కాంగ్రెస్ ఆశాకిరణం రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని రాహుల్ గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కుటుంబానికి నేడు పండగ రోజన్నారు. అనేక త్యాగాలు చేసిన కుటుంబంలో జన్మించిన గొప్పనాయకుడని కొనియాడారు. ఆయన చేసిన సాహసోపేతమైన భారత్ జోడో యాత్ర, భారత్ న్యాయ యాత్ర చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ యాత్రల ద్వారానే కాంగ్రెస్ పార్టీ తిరిగి పుంజుకుందని తెలిపారు. దీంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని శాసించే స్థితికి ఇండియా కూటమి వచ్చిందన్నారు. దాని ఫలితంగా బీజేపీ ప్రధానంగా రెండు ప్రాంతీయ పార్టీల సహకారంతో కేంద్రంలో అధికారాన్ని చేపట్టాల్సి వచ్చిందని, అదెప్పుడైనా కూలిపోయే అవకాశముందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిర్మల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజర్ హుస్సేన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు జునైద్ మెమన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్, సారంగాపూర్ మండల అధ్యక్షులు భూమేష్, సీనియర్ నాయకులు అల్తాఫ్ అహ్మద్ కిజార్, కుంతం గణేష్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : స్వర్ణ గ్రామంలో బుధవారం తాజా మాజీ సర్పంచ్ అయేషా అబ్దుల్ హాది ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ 54వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పది కిలోల కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు జావీద్, కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి, సాజిద్, మసూద్, ఆత్రం లక్ష్మణ్, శైమద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకలు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇదులవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య తో పాటు మధ్యాహ్నంన భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులను అందించడం జరుగుతుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, కాశయ్య, రాజయ్య, శంకర్, పెంటయ్య, లచ్చన్న, జయరాజ్ పాల్గొన్నారు. మండలంలోని చిర్రకుంట ప్రభుత్వ పాఠశాలలో 17 సంవత్సరాలుగా విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు ధనరాజ్ బదిలీపై వెళ్తుండగా బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయ బృందంతో కలిసి ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ పాల్గొని శాలువాతో సన్మానించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దు


- పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వైద్యశిబిరం
- డీఎస్పీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు సిబ్బంది 24 గంటలు విధులను నిర్వర్తిస్తూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తారని ఆరోగ్యం పట్ల ఎటువంటి అశ్రద్ధ వహించొద్దని డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బుధవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల ముందస్తుగా ఆలోచించి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉచితంగా కేర్ హాస్పిటల్ వారి సహకారంతో ఆర్.చంద్ర కిరణ్‌రెడ్డి, ఎండీ, డిఎన్బి కార్డియాలజిస్ట్, ఎస్ జగదీశ్వర్, ఎండి, డీఎం, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, కందుల సంకల్ప్, క్లినికల్ ఫిజియోథెరపిస్ట్, విశ్వనాథ్, ఎండి,ఎంఎస్, ఆర్థోపెడిక్ సర్జన్, డి.సంతోష్, ఆప్తమెట్రిస్ట్, జయజ్యోతి, గైనకాలజీ, రాజేష్, జనరల్ ఫిజీషియన్ ఇలాంటి విభాగాలలో సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సిబ్బందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు, గుండెకు సంబంధించిన, ఈసీజీ, టు డీకో, కాల్షియం పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్ పోతారం శ్రీనివాస్, సీఐలు కే.సత్యనారాయణ, డి సాయినాథ్, ఏ.అశోక్, శ్రీనివాస్, కే.ఫణిధర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు టి.మురళి, ఎ.నవీన్ కుమార్, చంద్రశేఖర్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్స్ హైస్కూల్‌లో ఇంట్రాక్టివ్ ప్యానెల్స్

నవతెలంగాణ-మందమర్రి



లిటిల్ ఫ్లవర్స్ హై స్కూల్ 26 సంవత్సరాలు పూర్తి చేసుకొని 27వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా బుధవారం ఐదు ఇంట్రాక్టివ్ ప్యానల్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మండల విద్యా శాఖ అధికారి జాడి పోచయ్య, బీఆర్ఎస్ ఎంఎ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణు వర్ధన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం నియోజకవర్గంలోనే మొదటగా ప్రారంభించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల పరిజ్ఞానాన్ని టెక్నాలజీతో అనుసంధానం చేసి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ పరిజ్ఞానం ఎంతగానో సహకరిస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ దామెర్ల సిద్దయ్య, ప్రిన్సిపాల్ రమ మాట్లాడుతూ ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రకృతితో అనుసంధానం చేసే ఈ విద్యావిధానం విద్యార్థుల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తుందని తెలిపారు. కార్పొరేట్ విద్యాలయాల కంటే మెరుగైన విద్యను అందించే ఏకైక పాఠశాల లిటిల్ ఫ్లవర్స్ హై స్కూల్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ క్యాంపల్లి సమ్మయ్య, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, క్లర్క్ పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాకీ ముసుగులో కామాంధుడు

- మొదటి సారి సస్పెన్షన్..రెండవ సారి డిస్మిస్
- భవానీ సేన్ రాసలీలలు ఎన్నెన్నో

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలోనే కామాంధుడు కొలువై ఉన్నాడు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన భవానీ సేన్ ప్రత్యేక పార్టీలో కానిస్టేబుల్‌గా పనిచేసి అధికారుల అండదండలతో అంచలంచెలుగా ఎస్సై స్థాయికి ఎదిగి వివాదాస్పదుడుగా మారాడు. మావోయిస్టుల కార్యకలాపాలు అత్యధికంగా ఉన్న రోజుల్లో ప్రత్యేక పార్టీ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయన జిల్లా స్థాయి అధికారుల అండదండలతో ఎస్సై స్థాయికి ఎదిగాడు. తనకు అడ్డం ఎవరూ లేరని ఎన్నో అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నాడు. దహెగాంలో పనిచేసిన రోజుల్లో స్థిరాస్తి వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి ఎకరాల కొద్ది భూమి సంపాదించుకున్నాడు. అధికారుల అండతో రెబ్బెన ఎస్సైగా ఉన్న సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ఫిర్యాదు దారుల పట్ల దురుసుగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. రెబ్బెనలో ఓ యువతిని మహిళా కానిస్టేబుల్ పోస్టు ఇప్పిస్తానని ఆమెను సైతం లైంగికంగా వేధింపులకు గురిచేయడంతో సదరు యువతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. జిల్లా అధికారులు వాస్తవాలను పరిగణలోకి తీసుకుని తూతూ మంత్రంగా విచారణ చేపట్టి 12 జులై 2022న సస్పెండ్ చేశారు. 6 నెలల అనంతరం తిరిగి ఓ జిల్లా స్థాయి పోలీసు అధికారి పైరవీతో మళ్ళీ పోస్టింగ్ దక్కించుకున్నాడు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోస్టింగ్ దక్కించుకున్న భవానీ సేన్‌కు అనతి కాలంలోనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎస్సైగా పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం నేర ప్రవృత్తి కలిగిన ఎస్సైని వెంటనే విధుల్లోకి తీసుకోకూడదనే నిబంధనలు కాలరాసి పోస్టింగ్ ఇచ్చారు. జిల్లా అధికారుల అండదండలున్నాయనే అహంకారంతో కాళేశ్వరంలో సైతం తన కామబుద్దిని మరో సారి ప్రయోగించారు. ఓ మహిళా కానిస్టేబుల్ తెగించి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన వెలుగు చూసింది. ఇలా ఆయన ఎక్కడ పనిచేసినా స్టేషన్లలో మహిళలు వస్తే వారి సెల్ నెంబర్లు తీసుకుని లైంగికంగా వేధింపులకు గురిచేయడమే కాకుండా శారీరకంగా అనుభవించినప్పటికీ ఎస్సై అనే కారణంతో బయటకు రాని సంఘటనలున్నాయి. ఇంత జరిగిన అనంతరం అధికారులు ఆయనను ఉద్యోగం నుంచి తొలగించడం పట్ల అనేక మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సై స్థాయికి ఎదిగిన ఆయన ఆస్తులపై విచారణ చేపట్టితే రూ.కోట్లాది ఆస్తులు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా ఉన్నతాధికారులు ఏ మేరకు విచారణ చేపడతారో వేచి చూడాల్సిందే.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కుకుట గ్రామానికి చెందిన దుర్గం దేవాజి నమస్తే తెలంగాణ విలేకరిని బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.పదివేలు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు డోక్య వెంకన్న, భషరత్ ఖాన్, ఇంజీరి రాజారాం, అమీరుద్దీన్, సకారం, రహమత్, ఆబిద్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ కొండపురం భూమన్న, అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కట్ట చిన్నారెడ్డి, కనకాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ నరేష్ వాళ్ల నాన్నమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ బాధిత కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడ్డం సుదర్శన్ రెడ్డి, మండల అధ్యక్షులు లలిత భోజన్న, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సోమ సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచులు కపిల్, రమణరెడ్డి, ఎల్లన్న, నర్సయ్యలు, ఎంపీటీసీ సాయరెడ్డి, గంగాధర్‌లు, భైంసా పట్టణ అధ్యక్షులు శంకర్ చంద్రే, సీనియర్ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, గన్ను నర్సారెడ్డి, రాజురెడ్డి, పండరి గౌడ్, షఫీ, లక్ష్మణ్, రమేష్‌రెడ్డి, సోంనాథ్ పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే బీజేపీ గెలుపు

నవతెలంగాణ-జన్నారం

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సమిష్టి కృషి వల్లనే ఎంపీ అభ్యర్థిగా గెలుపొందానని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ అన్నారు. బుధవారం జన్నారంలో నిర్వహించిన విజయోత్సవ అభినందనసభలో పాల్గొని ప్రసంగించారు. తన గెలుపులో జన్నారం మండలం కీలకపాత్ర పోషించిందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మరింత పనిచేయాలని కోరారు. ముందుగా ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లతో కలిసి తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో బస్టాండ్ నుంచి రామాలయం వరకుభారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మోడీ చేస్తున్న సంక్షేమ పథకాలతోనే బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదనరావు, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, మాజీ మండలాధ్యక్షుడు గోలి చందు, జిల్లా నాయకులు బద్రీ నాయక్, మహేష్, నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపతి, ముడుగు ప్రవీణ్, కూకటికారి శంకర్, గంగాధర్, యుగంధర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేలంపాట పూర్తి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ వార, దిన సంతలకు బుధవారం గ్రామపంచాయతీలో నిర్వహించిన వేలంపాట పూర్తి అయినట్లు స్పెషల్ ఆఫీసర్ ఈఓపీఆర్డీ రమేష్, పొన్కల్ ఈఓ రాహుల్ తెలిపారు. ప్రతిరోజు పొనకల్ పట్టణంలో నిర్వహించే దిన సంతకు మొత్తం 32 మంది దరఖాస్తులు చేసుకోగా, రూ.2,61,500తో రాజన్న అనే వ్యక్తి వేలం పాటను దక్కించుకున్నాడని తెలిపారు. అలాగే ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు నిర్వహించిన వేలంపాటలో 46 మంది దరఖాస్తు చేసుకోగా రూ.ఐదు లక్షల 35 వేలతో జాజాల శ్రీకాంత్ అనే వ్యక్తి వేలంపాటను దక్కించుకున్నట్లు తెలిపారు. వేలం పాటను దక్కించుకున్న ఇరువురు గ్రామపంచాయతీ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మందపల్లి పశువుల సంత వేలం పాట వాయిదా

మండలంలోని మందపల్లి(రేండ్లగూడ)లో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంతకు వేలంపాటను స్పెషల్ ఆఫీసర్ కస్తూరి శ్రీకాంత్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేలం పాటలో అప్సెట్ ప్రైజ్ రాకపోవడంతో గురువారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోమశేఖర్

నవతెలంగాణ-రెబ్బెన

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని నంబాలకు చెందిన చెన్న సోమశేఖర్‌ను నియమించారు. బుధవారం హైదరాబాద్‌లోని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య నియమక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి ఆయన పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవికి న్యాయం చేస్తానని అన్నారు.